# అడుగు

సమగ్ర తెలుగు దినపత్రిక

Website: www.adugunews.com

The Step Towards The Truth..

హైదరాబాద్ | ఆదివారం 12 ఏప్రిల్ 2026 | సంపుటి: 02 | సంచిక: 55 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com


## ఐటీడీఏల బలోపేతం

**కేంద్ర డైరెక్టర్ తో సమీక్ష**

హైదరాబాద్,ఏప్రిల్11(అడుగు న్యూస్): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐటీడీఏల బలోపేత చర్యలపై కేంద్ర ప్రభుత్వం, గిరిజన మంత్రిత్వ శాఖ, హైదరాబాద్ లోని మాసబ్ టాంక్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో కార్యశాల నిర్వహించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. వర్నాలి డేకా హాజరయ్యారు.సమావేశంలో ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని తెలియచేస్తూ మిగతా 3లో..

## ఇక వాట్సాప్‌లోనే రిజిస్ట్రేషన్ సేవలు!

**'మీసేవ వాట్సాప్ చాట్‌బాట' ప్రారంభం**

**8096958096 వాట్సాప్ కు 'హాయ్' ద్వారా సందేశాలు**

హైదరాబాద్,ఏప్రిల్11(అడుగు న్యూస్): డిజిటల్ పాలనలో తెలంగాణ ప్రభుత్వం మరో విప్లవాత్మకమైన ముందడుగు వేసింది. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగానికి సంబంధించిన కీలక సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వాటిని నేరుగా వాట్సాప్ ద్వారా


మిగతా 3లో..

## ఫ్లాష్.. ఫ్లాష్... ఫ్లాష్

# చర్చలు విఫలం!

## శాంతికి విఘాతం!!

- సుదీర్ఘ చర్చల్లో కుదరని సమన్వయం
- అర్ధంతరంగా తిరిగి వెళ్ళిన వాన్స్ బృందం
- అమెరికా నిబంధనలకు ఇరాన్ ఒప్పుకోవడం లేదు
- స్వయంగా ప్రకటించి, అమెరికాకు వెళ్ళిన ఇవాన్స్
- ఇస్లామాబాద్ లో అమెరికా, ఇరాన్ దేశాల భేటీ
- అమెరికా తరపున ఇవాన్స్, విట్కాఫ్, కుష్నర్
- ఇరాన్ తరపున గలీబఫ్, అరాగ్చీల హాజరు
- రెండు గంటలకుపైగా కొనసాగిన చర్చలు
- చిక్కుముడి వీడని హార్మూజ్ జలసంధి ఒప్పందం
- విదేశాల్లోని ఇరాన్ ఆస్తుల ఫ్రీజింగ్ ఎత్తివేతకు ఓకే?
- లెబనాన్ పై దాడుల తీవ్రత తగ్గింపునకు అంగీకారం
- యుద్ధ నష్ట పరిహారం మొత్తం చెల్లించాలి
- మా సార్వభౌమత్వాన్ని అంగీకరించాలి
- హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు
- చర్చలను మరో రోజుకు పొడిగించాలన్న పాకిస్తాన్
- హార్మూజ్ ను క్లియర్ చేస్తున్నామని ప్రకటించిన ట్రంప్
- దౌత్యం విఫలం అయితే పంథా మార్చుకుంటాం
- యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు
- నాణ్యమైన చమురు మా వద్దే కొనండి: ట్రంప్ పిలుపు



ఇస్లామాబాద్,ఏప్రిల్11(అడుగు న్యూస్): అమెరికా–ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. శాంతి చర్చల్లో భాగంగా ఇరాన్‌కు చెందిన స్తంభించిన నిధులను విడుదల చేయడానికి అమెరికా అంగీకారం తెలిపింది. కతార్‌తో పాటు ఇతర విదేశీ బ్యాంకుల్లో ఉన్న దాదాపు ఆరు బిలియన్ డాలర్ల నిధులను ఇరాన్‌కు తిరిగి ఇవ్వడానికి అగ్రరాజ్యం సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. ఇస్లామాబాద్ వేదికగా జరుగుతున్న శాంతి చర్చల్లో ఒక నిర్దిష్టమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవడం పట్ల వాషింగ్టన్ ఎంత సీరియస్‌గా ఉందో ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. చాలా కాలంగా మిగతా 2లో..

## దక్షిణాదిపై కక్షకట్టిన కేంద్రం

- ఉత్తరాదిలో ఎంపీ సీట్లు పెంచుకునే కుట్ర
- 2011 జనాభా లెక్కల ద్వారా అశాస్త్రీయం
- 42% బీసీ రిజర్వేషన్ల మాటేమిటి?
- బీసీ సబ్ ప్లాన్ పై ప్రభుత్వం ఆలోచిస్తోంది
- పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ భట్టి



హైదరాబాద్,ఏప్రిల్11(అడుగు న్యూస్): కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా మిగతా 2లో..

## ఘోర రోడ్డు ప్రమాదం

**13మంది మృతి**

**బిహార్‌లో ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, వ్యాన్**



కటిహార్,ఏప్రిల్11(అడుగు న్యూస్): బిహార్‌లోని కటిహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం సాయంత్రం ఒక బస్సు, ఒక పికప్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆ ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతులందరూ పూర్ణియా నివాసితులు. ప్రమాదంలో అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కోఢా పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్‌గడా చౌక్ సమీపంలో, జాతీయ రహదారి 31పై ఆ ఘటన జరిగింది. పికప్ ట్రక్కులో గిరిజన వర్గానికి చెందిన వారు ఒక జాతర నుంచి తిరిగి వస్తున్నారు. అప్పుడు వేగంగా వస్తున్న ఒక బస్సు ఎదురుగా వచ్చి పికప్ ట్రక్కును బలంగా ఢీకొట్టింది. దీంతో పికప్ వ్యాన్ పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. పలువురు అక్కడికక్కడే మరణించారు. కాగా, ఘటన జరిగిన వెంటనే స్థానికులు కోఢా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, స్థానిక మిగతా 2లో..

### ఐలాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

**ఉద్రిక్తతల మధ్య భారీ ఆపరేషన్**

**సంగారెడ్డి, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్):** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామ పరిధిలో హైడ్రా అధికారులు చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు ఉద్రిక్తతలకు దారితీశాయి. సర్వే నెంబర్ 208లో ఉన్న కేప రెసిడెన్సీ, క్రిస్టల్ డెవలపర్స్ భవనాల్లో అద్దెకు ఉంటున్న నివాసితులను ఖాళీ చేయించి, మిగతా 2లో..

## మంగ్లీపై కేసు!

- లాయర్ ను బెదిరించారని నమోదు
- సోదరుడు, మరో ముగ్గురితో కలిసి భారీగా వసూళ్ళు?
- రూ.200 కోట్ల మేర, ఏపీ, కర్ణాటకల్లో బాధితులు?
- చంపుతామని బెదిరించారని అడ్వోకేట్ ఆరోపణలు
- నోట్లకట్టల వీడియోలతో బ్లాక్ మెయిలింగ్ : మంగ్లీ

మిగతా 2లో..

## నెలరాజుతో పది రోజులు!

- ఆర్టెమిస్ 2 అంతరిక్ష యాత్ర విజయవంతం
- శాన్ డియాగో తీరంలో దిగిన వ్యోమ నౌక
- అందులోని వ్యోమగాములూ సురక్షితం
- 10రోజుల యాత్ర... 11 లక్షల కి.మీ. ప్రయాణం
- చంద్రుడిని దాటి భూమి నుంచి 4 లక్షల కి.మీ.చేరిక
- 50ఏళ్ళ తర్వాత చంద్రుడిని చుట్టివచ్చిన మానవులు




న్యూయార్క్, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్): అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన ఆర్టెమిస్–2 రోదసి యాత్ర విజయవంతంగా పూర్తై, చంద్రుడిపై మళ్లీ మనుషులను పంపే లక్ష్యంలో కీలక ముందడుగు పడింది. ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి ఏప్రిల్ 1న ప్రయాణం ప్రారంభించిన ఓరియన్ వ్యోమనౌక, 10 రోజుల యాత్ర అనంతరం అమెరికా శాన్ డియాగో తీరంలో మిగతా 2లో..

## అవినీతా?

**ప్రతిపక్షాలు పిచ్చి ప్రేలాపణలు ఆపాలి**

**ములుగు కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క**

ములుగు,ఏప్రిల్11(అడుగు న్యూస్): మేడారం సమ్మక్క- సారక్క అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ



పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గద్దెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నారని.. ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు.శనివారం ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మిగతా 3లో..

## కరువు దరువు!

- వానలు తక్కువే! ఎండలు ఎక్కువే!!
- 21 జిల్లాల్లో వర్షపాతం లోటు
- 12 జిల్లాల్లోనే సాధారణం
- నేడు రేపు ఎండలు 43 డిగ్రీలు
- వాతావరణ శాఖ హెచ్చరికలు

హైదరాబాద్,ఏప్రిల్11(అడుగు న్యూస్): ఇప్పటికే ఎండలు దంచి కొడుతున్నాయి. అయితే అంతగా వర్షాలు మాత్రం పడవని వాతావరణ సంస్థ ప్రకటించింది. తాజాగా తెలంగాణలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బలమైన ఎల్–నినో ప్రభావం, పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ పరిస్థితుల మిగతా 3లో..

## టోల్‌ప్లాజా వద్ద విషాదం

**ట్యాంకర్ బోల్తాతో హైకోర్టు న్యాయవాది మృతి**

విజయవాడ/కంచికచర్ల, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్): ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్‌ప్లాజా వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది బొద్దులూరి శ్రీనివాసరావు (55) దుర్మరణం చెందారు. టోల్‌బూత్ వద్ద తన బీఎండబ్ల్యూ కారును ఆపి ఉండగా, వెనుక నుంచి సిమెంట్ ఫ్లైయాష్‌తో వస్తున్న భారీ ట్యాంకర్ అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కి కారుపై బోల్తా పడింది. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో శ్రీనివాసరావు డ్రైవర్ సీట్లోనే ప్రాణాలు కోల్పోయారు. శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో ఉన్న ఆయన టోల్‌గేట్ వద్ద ఆగిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ట్యాంకర్‌ను మిగతా 3లో..

### నేడు ఇంటర్ ఫలితాలు

**వాట్సాప్ లోనూ వివరాలు**

**హైదరాబాద్,ఏప్రిల్11(అడుగు న్యూస్):** తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా మిగతా 3లో..

## ఆత్మ స్తుతి, పరనింద ఇంకెంత కాలం!?

అధికార కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడిందా? అధికారంలోకి రావడానికి ముందు బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేసిన కాంగ్రెస్, ఇప్పుడు వాటిని నిరూపించడంలో విఫలమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ళు గడిచినా, గత ప్రభుత్వంపై చేసిన అవినీతి ఆరోపణల నిరూపణల్లో జాప్యం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆ అజెండా నుంచి నెమ్మదిగా తప్పుకోవడం రాజకీయ వ్యూహమా? లేక పరిపాలనా లోపమా? పరిమితుల కారణమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**డా. మార్గం-అడుగు**

ఎడిటోరియల్ 2వ పేజీలో

## సంపాదకీయం

## మార్గం - అడుగు



### ఆత్మ స్తుతి, పరనింద ఇంకెంత కాలం!?

తెలంగాణ రాజకీయాల్లో ఇటీవలి పరిణామాలు అధికార కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలోకి రావడానికి ముందు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వంపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకత్వం, ఇప్పుడు వాటిని నిరూపించడంలో విఫలమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ళు గడిచినా, గత ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు, అవినీతి నిరూపణలపై స్పష్టమైన పురోగతి కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

బీఆర్ఎస్ హయాంలోని కాళేశ్వరం ప్రాజెక్ట్, ఈ కార్ రేసు, ధరణి వంటి కీలక అంశాలపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాలు నెమ్మదిగా అజెండా నుంచి తప్పుకోవడం గమనార్హం. ఇది రాజకీయ వ్యూహమా? లేక పరిపాలనా లోపమా? పరిమితుల కారణమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆరోపణలు చేయడం ఒక ఎత్తు. వాటిని నిరూపించడం మరో ఎత్తు. అయితే, అధికారంలోకి వచ్చాక జరుగుతున్న తాత్సారమే అనేక ప్రశ్నలను సంధిస్తున్నాయి.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న కొంతమంది మంత్రులపై కూడా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై వచ్చిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఆరోపణలను ఆయన ఖండించినప్పటికీ, ప్రజల్లో నమ్మకం కలిగేలా సమగ్ర విచారణ, అనుమానాలను నివృతి జరగలేదన్న అభిప్రాయం ఉంది. "నిప్పులేనిదే పొగరాదు" అన్న సామెత ఇక్కడ ప్రస్తావనకు వస్తోంది. అధికారంలో ఉన్నవారు పారదర్శకంగా స్పందించకపోతే అనుమానాలు మరింత పెరుగుతాయి.

నాదర్‌గుల్ ప్రాంతంలో భూములపై నెలకొన్న వివాదం ప్రస్తుతం ప్రధాన సమస్యగా మారింది. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూముల నుంచి రైతులను దూరం చేయడం, ప్రైవేట్ కంపెనీల జోక్యం పెరగడం వంటి అంశాలు తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తున్నాయి. ఆ భూములు ప్రభుత్వానివా? ప్రైవేట్‌వా? రైతుల హక్కులు ఎమయ్యాయి? ప్రభుత్వం ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదు? జవాబు దొరకని పరిస్థితుల్లో రైతులు భూపోరాటానికి దిగారు. వారు కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, ప్రత్యక్ష చర్యలకు దిగడం పరిస్థితి తీవ్రతను చూపిస్తోంది.

రైతులు తమ భూముల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు, బౌన్సర్లు అడ్డుకోవడం ఉద్రిక్తతలకు దారితీసింది. చివరకు పరిస్థితి అదుపుతప్పి, రైతులు గేట్లు దాటి లోపలికి వెళ్లడం, బౌన్సర్లను తరిమికొట్టడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇది కేవలం భూమి వివాదం మాత్రమే కాదు. ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్న సంకేతం కూడా. ఈ ఉద్యమానికి బీఆర్ఎస్ తో పాటు వామపక్ష పార్టీలు మద్దతు తెలపడం రాజకీయ రంగును తీసుకువచ్చింది. మరోవైపు కాంగ్రెస్ నేతలు అక్కడికి వెళ్లి కూడా ప్రతిపక్షంపై విమర్శలు చేయడం రైతుల్లో అసహనాన్ని పెంచింది.

రైతులు సమస్య రాజకీయం కావడం కంటే పరిష్కారం కావాలని కోరుకుంటున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఏం చేయాలి? భూముల యాజమాన్యంపై స్పష్టత ఇవ్వాలి. స్వతంత్ర విచారణ జరపాలి. రైతుల హక్కులను రక్షించాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఇవి చేయకపోతే ప్రజల్లో అవిశ్వాసం మరింత పెరిగే అవకాశం ఉంది.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఒక కీలక దశలో ఉంది. ప్రతిపక్షాన్ని విమర్శించడం కంటే, పాలనలో పారదర్శకత చూపించడం అత్యవసరం. నాదర్‌గుల్ వంటి సంఘటనలు కేవలం స్థానిక సమస్యలు కావు. అవి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పరీక్షించే సూచికలు.

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వచ్చి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం, చర్యలు తీసుకోవడం అవసరం.

# అక్షర యశస్వి.. మలయశ్రీ

తెలంగాణ తేనె మాగాణంలో వివిధ ప్రక్రియలలో వైవిధ్యమైన శతాధిక రచనలు చేసిన సాహితీ మూర్తి డాక్టర్ మలయశ్రీ. ప్రాథమిక స్థాయి విద్యార్థుల నుంచి పరిశోధక స్థాయి విద్యార్థుల దాకా ప్రతిభావంతమైన రచనలు చేశాడు. కవులకు, కళాకారులకు కాణాచి కరీంనగర్ జిల్లా చెంజర్లలో 10.10.1940న రైతు కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పుడు తమ, చుట్టుపక్కల గ్రామాల్లో ప్రదర్శించే వీధి బాగోతాలు, హరికథల పట్ల అభిమానాన్ని, ఆదరాన్ని పెంచుకున్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా నియమితులై ఇటు విద్యావ్యాసంగాన్ని అటు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటూ, ఎం.ఏ., పిహెచ్.డి పూర్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు ఉపన్యాసకులుగా పదవీ విరమణ పొందారు. సంగని మల్లయ్య అనే తన పేరును "మలయశ్రీ"గా మార్చుకొని, 1968లో "కావ్య సుందరి" ఖండ కావ్య రచనతో సాహితీ సేద్యానికి శ్రీకారం చుట్టారు. అప్పటినుండి ఆయన నాటౌట్ బ్యాట్స్మెన్ గా తుది శ్వాస వరకు రచనా వ్యాసంగం చేస్తూనే ఉన్నారు.

ఇప్పటివరకు అచ్చయిన, కానివి కలుపుకుని 150 రచనలు చేశారు. అందులో ధర్మ శ్రీ, సురభి, తొలిసంధ్య, మలి సంజ లాంటి పద్య కావ్యాలు, నారాయణ రెడ్డి గారి కర్పూర వసంత రాయలు ప్రభావంతో రాసిన "రాగశిఖ"లాంటి గేయ కావ్యం, మల్లెలు మందారాలు, రాగవల్లరి వంటి లలిత గేయాలు, పేదల పాటలు, ఎన్నికల పాటలు, రైతు పాటలు, రంగుల పిట్టలు, బంగారు బొమ్మలు, చుక్కల లోకం, పాల మనసులు వంటి బాలసాహిత్య రచనలు, కాళిదాసు మేఘ సందేశానికి యక్ష సందేశం పేరుతో ఆయన చేసిన అనువాదం, ఐరేని కుండలు కథలు, కలవారి కష్టాలు, విచిత్ర ప్రేమ, వెన్నెల వాన, తిరుగుబాటు, నిర్ణయం వంటి నవలలు రాశారు. అలాగే పిల్లల కోసం అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, జయప్రకాష్ నారాయణ మొదలైన దేశభక్తుల జీవిత చరిత్రలను ప్రచురించారు. శాంతి పథం, ప్రజాకవి వేమన, గణపతి దేవుడు, ప్రతాపరుద్రుడు వంటి నాటకాలు రాశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందే జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి అన్నట్లు మలయ శ్రీ క్రీ.శ 950-1995 నడుమ వచ్చిన కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్యం పై "కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర" అన్న శీర్షికతో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ప్రముఖ పండితులు డాక్టర్ కే.రాజన్న శాస్త్రి గారి పర్యవేక్షణలో డాక్టరేట్ పట్టాన్ని పొందారు. ఈరోజు తెలంగాణ సాహిత్య అకాడమీ,



తెలంగాణ సారస్వత పరిషత్తు పక్షాన వెలువడుతున్న రచనలకు ఇది మార్గదర్శకమైంది. మలయశ్రీ ఈ విషయమై చేసిన పరిశ్రమ, పరిశోధన స్ఫూర్తిదాయకమయ్యాయి. 1970 దశకంలో రాష్ట్రంలో నెలకొన్న విప్లవోద్యమాల మూలంగా సమాజ పరిస్థితులను గమనంలో పెట్టుకొని ప్రభుత్వం విద్యార్థులలో శాంతి అహింసలను ప్రబోధించడానికై పాఠ్యాంశ ఎంపిక కోసం నిర్వహించిన పోటీలో మలయ శ్రీ రాసిన బౌద్ధ సంబంధమైన "శాంతిపథం" అనే నాటకం ఎంపిక అయి ఇంటర్ విద్యార్థులకు ఉపవాచకంగా నిలిచింది.

ఆయనకు మొదటి నుండి లేఖ సాహిత్యం అంటే ప్రత్యేకమైన ఆసక్తి. ఆయన రాసిన "తెలుగులో లేఖా సాహిత్యం " అనే గ్రంథాన్ని పాఠక జనాదరణ గ్రంథంగా భావించి తెలుగు అకాడమీ ప్రచురించింది. ఈ విషయమై తెలుగులో వెలువడిన మొదటి గ్రంథం ఇదే. 1989లో తెలుగు విశ్వవిద్యాలయం తరపున నిర్వహించిన చరిత్ర-సంస్కృతి విషయ పోటీలో మలయశ్రీ రాసిన "కాకతీయుల కాలంనాటి సామాజిక జీవితం" అనే గ్రంథం ప్రథమ బహుమతిని సాధించింది. అలాగే ఆయన రాసిన తిరుగుబాటు నవలకు విశాలాంధ్ర , నిర్ణయం నవలకు మండలి వెంకటకృష్ణారావు స్మారక పురస్కారం లభించాయి. రాష్ట్రస్థాయికి చెందిన రసమయి వారి సాహితీ అవార్డు, బి. ఎన్ .శాస్త్రి, పి. యశోదా రెడ్డి, డాక్టర్ ద్వానా శాస్త్రి సాహిత్య పురస్కారాలను, ముఖ్యంగా తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహిత్య పరిశోధన పేర ఏర్పరిచిన పురస్కారాన్ని అందుకున్నారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతలైన వినోద్ కుమార్ శుక్ల రచించిన హిందీ రచనకు"ఆ గోడపై ఒక కిటికీ ఉండేది" అనే పేరుతో తెలుగులో రచించి కేంద్ర సాహిత్య అకాడమీ వారికి అందించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని పొందారు. సత్యార్థి, భౌతికవాది అనే పత్రికలను నెలకొల్పి, కొనసాగించారు. 1996లో నవ్య సాహిత్య పరిషత్తును స్థాపించి తన రచనలతో పాటు ఇతరుల రచనలను కూడా వెలువరించారు. సంస్థ తరపున కవులకు, చరిత్రకారులకు, పరిశోధకులకు, గాయకులకు పురస్కారాలు అందించారు. మలయశ్రీ అవార్డును అందుకున్న వారిలో బోయ జంగయ్య, జి.వై.గిరి, వంగపండు ప్రసాదరావు, టి. రాజారాం సింగ్, సుప్రసిద్ధ కథకులు కాలువ మల్లయ్య, ఉద్యమ గాయకులు గూడ అంజయ్య, అందెశ్రీ, కవులు అని శెట్టి రజిత, అన్నవరం దేవేందర్ మొదలైన వారు ఉన్నారు.

ఉద్యోగరీత్యా నేను ఈ జిల్లాలో పని చేస్తున్న కాలంలో మలయశ్రీతో ఏర్పడిన పరిచయమే నన్ను పరిశోధనకు పురికొల్పింది. దానితో ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాచ్య భాషా అధ్యయనశాఖలో "మలయశ్రీ కావ్యాలు-పరిశీలన" అనే అంశంపై పరిశోధన చేసి 2006లో డాక్టరేట్ డిగ్రీ ని అందుకున్నాను. 20.6.2009న హైదరాబాదులోని త్యాగరాయ గాన సభలో జరిగిన పుస్తకావిష్కరణ సభలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి గ్రంథాన్ని ఆవిష్కరించారు. అలాగే ప్రముఖ విద్యావేత్త డాక్టర్ చుక్కా రామయ్య విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. గ్రంథ ప్రచురణకు ఆర్థిక సహకారాన్ని అందించిన కరీంనగర్ కు చెందిన డా. కె. శ్యాంసుందర్ కు గ్రంథాన్ని అంకితం ఇచ్చాను. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షులుగా పనిచేసిన ప్రొఫెసర్ ననుమాస స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సభలో నా పర్యవేక్షకులు డాక్టర్ అప్పం పాండయ్య, పుస్తక పరిచయ కర్తలుగా మిత్రులు పల్లెర్ల రామమోహన్ రావు ప్రభృతులు పాల్గొన్నారు. మలయశ్రీని దగ్గరగా గమనించినప్పుడు ఆయన కేవలం కవి, రచయిత మాత్రమే కాదు ఆచరణశీలి. తన రచనలలో ఆయన ఏమి ప్రబోధించాడో వ్యక్తిగతంగా తన జీవితంలోనూ కుటుంబంలోనూ వాటిని పాటించాడు. నిరంతర రచన, అధ్యయనం, పరిశోధన, ప్రచురణ, పర్యటనలతోనే ఆయన జీవితం గడిచేది. ప్రాచీన ఆధునిక సాహిత్యాలను వాటి సిద్ధాంతాలను, వస్తున్న ధోరణులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అందుకు అనుగుణంగా కాలంతో పోటీ పడుతూ రచన వ్యాసంగాన్ని కొనసాగించేవాడు. మినీ కవితలు, నానీలు వస్తున్న రోజుల్లో ఆయన త్రిపదలు రాశాడు. హేతువాదిగా ఉంటూ మానవతావాదిగా జీవించారు. సాహిత్యం, చరిత్ర, పరిశోధన, బౌద్ధం, సైన్సు అన్నవి ఆయన అభిమానాంశాలు. వాటిని మూల బిందువుగా చేసుకునే ఆయన సాహిత్య వ్యాసంగం కొనసాగింది. సినారె అన్నట్లు "మలయశ్రీ సృజన శీలానికి అంచనావేయలేనన్ని అంచులు ఉన్నాయి." ఇంతటి బహుముఖ ప్రతిభాశాలిని కారుణ్యంలేని కాలం 10.4.2026 న కాటేసింది. "నేను అచ్చంగా భౌతిక నైతిక వాదిని. బతుకు-బతుకనివ్వు సిద్ధాంతం నాది" అని ప్రకటించుకున్న మలయశ్రీ దివ్యస్మృతికి ఇదే నా అక్షర నివాళి.



-డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
పాలకుర్తి. ఫోన్ నెం.: 9989148305

# దక్షిణాదిపై కక్షకట్టిన కేంద్రం

మొదటిపేజీ తరువాయి..

నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని, ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని డిప్యూటీ సీఎం వివరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

గ్రామస్థులు సహాయంతో గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈలోగా, మృతుల మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం పరీక్ష కోసం పంపించారు. బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని స్థానిక నివాసి దిలీప్ కుమార్ ఆరోపించారు. డ్రైవర్ బస్సును అతివేగంగా నడుపుతున్నాడని, అతని నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దుర్ఘటనకు పూర్తి బాధ్యత బస్సు డ్రైవరే వహించాలని అన్నారు. "పికప్‌లోని ప్రయాణికుల్లో ఎక్కువ మంది గిరిజన వర్గానికి చెందినవారు. వీళ్లంతా ఒక పండుగ జరుపుకుని తిరిగి వస్తున్నారు. సరిగ్గా సాయంత్రం ఒక బస్సు, పికప్ ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. గాయపడ్డవారందరిని పూర్ణియా మెడికల్ కాలేజీలో చేర్పించారు. మృతదేహాలన్నింటినీ పోస్ట్‌మార్టం పరీక్షలు, ఇతర అవసరమైన ప్రక్రియల కోసం కతిహార్‌లోని సదర్ ఆసుపత్రికి పంపించాం" అని సబ్-డివిజనల్ ఆఫీసర్ ప్రధుమ్న సింగ్ యాదవ్ తెలిపారు.

# నెలరాజుతో పది రోజులు!

మొదటిపేజీ తరువాయి..

సురక్షితంగా దిగింది. ఈ యాత్రలో వ్యోమగాములు రీడ్ వైస్‌మ్యాన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, కెనడాకు చెందిన జెరెమీ హాన్‌సెన్ పాల్గొని సురక్షితంగా తిరిగి వచ్చారు. మొత్తం 11,17,659 కిలోమీటర్లు ప్రయాణించిన ఈ యాత్రలో, ఓరియన్ భూమి నుంచి గరిష్టంగా 4,06,771 కిలోమీటర్ల దూరం చేరి కొత్త రికార్డు సృష్టించింది. చంద్రుడి సమీపానికి చేరుకుని, దాని ఉపరితల చిత్రాలను సేకరించారు. భూమి వాతావరణంలోకి తిరిగి ప్రవేశించడం అత్యంత ప్రమాదకర దశగా భావిస్తారు. ఓరియన్ క్యాప్సూల్ 2,700 డిగ్రీల సెల్సియస్ వరకు వేడెక్కి అగ్నిగోళంలా మారినా, హీట్ షీల్డ్ సమర్థంగా పనిచేసి వ్యోమగాములను కాపాడింది. కొన్ని నిమిషాల పాటు కమ్యూనికేషన్ కోల్పోయినా, చివరికి పారాచూట్ల సహాయంతో సురక్షితంగా సముద్రంలో ల్యాండ్ అయింది. అనంతరం వ్యోమగాములను యూఎస్ఎస్ జాన్ పీ ముర్తా నౌకలోకి తరలించారు. ఈ మిషన్‌లో పలు విశేషాలు నమోదయ్యాయి. చంద్రుడి సమీపానికి వెళ్లిన తొలి అమెరికాయేతర వ్యోమగామిగా జెరెమీ హాన్‌సెన్ నిలిచారు. తొలి నల్లజాతి వ్యోమగామిగా విక్టర్ గ్లోవర్, చంద్రయాత్రకు వెళ్లిన తొలి మహిళగా క్రిస్టినా కోచ్ చరిత్ర సృష్టించారు. ఈ యాత్రలో జీవన విధానాలు, ఆహారం, శ్వాస వ్యవస్థలపై కీలక పరీక్షలు నిర్వహించారు. కొన్ని సాంకేతిక లోపాలు ఎదురైనా, వ్యోమగాములు వాటిని అధిగమించారు. ఈ విజయంతో ఆర్టెమిస్-3, ఆర్టెమిస్-4 మిషన్లకు నాసా మరింత ధైర్యం పొందింది.

# చర్చలు విఫలం!

మొదటిపేజీ తరువాయి..

నిలిచిపోయిన ఈ భారీ నిధులను విడుదల చేయడం ద్వారా ఇరాన్‌తో నెలకొన్న వివాదాలకు శాంతియుత పరిష్కారం కనుగొనాలని అమెరికా భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు ఈ నిర్ణయం ఒక సానుకూల సంకేతంగా పరిగణించబడుతోంది. రెండు దేశాల ప్రతినిధులు ఇప్పుడు సానుకూల వాతావరణంలో తమ చర్చలను ముందుకు తీసుకువెళ్తున్నారు. త్వరలోనే ఈ నిధుల బదిలీ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ రాజకీయ నిపుణులు తమ అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారు. అమెరికా తీసుకున్న ఈ తాజా నిర్ణయం అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న వైరాన్ని తగ్గించుకునే దిశగా ఇది తొలి అడుగు. గతంలో ఇరాన్‌పై విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షల కారణంగా కతార్, ఇతర దేశాల్లోని వివిధ బ్యాంకులలో ఇరాన్ నిధులు స్తంభించిపోయాయి. దాదాపు ఆరు బిలియన్ డాలర్ల మేర ఉన్న ఈ ఆస్తులను తమకు తిరిగి ఇవ్వాలని ఇరాన్ ఎన్నాళ్లుగానో డిమాండ్ చేస్తోంది. తాజాగా పాకిస్థాన్‌లో జరుగుతున్న శాంతి చర్చల నేపథ్యంలో ఈ నిధులను ఎట్టకేలకు విడుదల చేయడానికి అమెరికా పచ్చజెండా ఊపింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న దౌత్యపరమైన ప్రతిష్టంభనను పూర్తిగా తొలగించడానికి దీన్ని ఒక ముఖ్యమైన పునాదిగా విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ దేశాల మధ్య ట్విస్ట్‌ల మీద ట్విస్ట్‌లు చోటు చేసుకుంటున్నాయి. అమెరికా ముందు మరోసారి కొత్త షరతులు ముందు పెట్టింది ఇరాన్. ముఖ్యంగా నాలుగు షరతులపై రాజీ లేదని ఇరాన్ ప్రతినిధి బృందం స్పష్టం చేసింది. కాల్పుల విరమణతో పాటు ఈ షరతులు కూడా ముఖ్యమే అని వెల్లడించింది. ఇక అమెరికా, ఇరాన్ ప్రతినిధి బృందాలకు విందు ఏర్పాటు చేశారు పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్. చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయని తెలిపారు. హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమత్వాన్ని అంగీకరించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. ఫ్రీజ్ చేసిన ఆస్తులను విడుదల చేయాలని కోరింది. ఓవైపు చర్చలు జరుగుతున్న సమయంలో హర్మూజ్ జలసంధి దగ్గర అమెరికా నౌకలు రావడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇరాన్ అభ్యంతరం తరువాత అమెరికా నౌకలు వెళ్లిపోయాయి.

# మంగ్లీపై కేసు!

- లాయర్ ను బెదరించారని నమోదు
- సోదరుడు, మరో ముగ్గురితో కలిసి భారీగా వసూళ్ళు?
- రూ.200 కోట్ల మేర, ఏపీ, కర్ణాటకల్లో బాధితులు?
- చంపుతామని బెదరించారని అడ్వోకేట్ ఆరోపణలు
- నోట్లకట్టల వీడియోలతో బ్లాక్ మెయిలింగ్ : మంగ్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్):** ప్రముఖ గాయని మంగ్లీ (సత్యవతి చౌహాన్)పై మోసం ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారు. రూ. 10 కోట్ల మేర మోసం చేసిందని ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో, బీఎన్ఎస్ సెక్షన్ 351(2), 352 కింద మంగ్లీతో పాటు ఆమె సోదరుడు మరియు మరో ముగ్గురిపై కేసు నమోదైంది. అదే సమయంలో మంగ్లీ కూడా నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యుత్తర ఫిర్యాదు చేశారు. తార్నాకకు చెందిన ఓ న్యాయవాది తనపై అసత్య ఆరోపణలు చేస్తూ రూ. 150 కోట్ల మోసం చేశానని ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. మార్చి 21న ఫోన్ చేసి కలవాలని ఒత్తిడి తెచ్చి, నిరాకరించడంతో పరువు తీస్తానని బెదిరించారని తెలిపారు. మరో వ్యక్తితో కలిసి తన కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, కరెన్సీ కట్టల వీడియోలు చూపించి మానసిక ఒత్తిడి కలిగించారని పేర్కొన్నారు. ఈ ఘటనల వల్ల తాను, తన కుటుంబం తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని చెప్పారు. ఈ మేరకు బీఎన్ఎస్ సెక్షన్ 79, 351(3) కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, తీన్మార్ వార్తల ద్వారా ప్రాచుర్యం పొందిన మంగ్లీ బతుకమ్మ, బోనాలు, సినీ పాటలతో విశేష గుర్తింపు సంపాదించింది.

## ఐలాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

మొదటిపేజీ తరువాయి..

రెండు జేసీబీలు, రెండు ప్రొక్లెయినర్లతో పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. నిర్మాణంలో ఉన్న గెస్ట్ హౌస్‌తో పాటు ఆరు అంతస్తుల భవనాన్ని నేలమట్టం చేశారు. సరైన నోటీసులు లేకుండా, కోర్టు స్టేను పరిగణలోకి తీసుకోకుండా చర్యలు చేపట్టారని బాధితులు అడ్డుపడటంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. అయినప్పటికీ పోలీసులు సహకారంతో హైడ్రా ఆపరేషన్ కొనసాగింది.

ఈ భూములు ప్రభుత్వ, ఇనాం భూములుగా గుర్తించబడి, అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ఐలాపూర్‌లో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమిలో 860 ఎకరాలను రక్షించేందుకు ఈ చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఈ భూముల విలువ రూ. 15 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. 1998 నుంచే హైకోర్టు స్టేటస్ కో ఉన్నప్పటికీ దానిని పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ, కోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. భూములను ఆక్రమించి అక్రమంగా ప్లాట్లు విక్రయించినట్లు ఆరోపించారు. మరోవైపు స్థానిక ప్లాట్ యజమానులు ఈ చర్యలను స్వాగతిస్తూ సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# పలు రైళ్లు రద్దు

మహబూబ్ నగర్, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్):
గద్వాల మార్గంలో నడిచే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. శనివారం నుండి ప్రారంభమైన ఈ రద్దులు పది రోజులపాటు కొనసాగనున్నాయి. కాచిగూడ--రాయచూర్, గద్వాల--రాయచూర్ రైళ్లు ఈ నెల 17వ తేదీ వరకు రద్దు చేశారు. కాచిగూడ--మహబూబ్ నగర్, గుంతకల్--బోధన్, కాచిగూడ--కర్నూల్ సిటీ, మహబూబ్ నగర్--కాచిగూడ రైళ్లు 19వ తేదీ వరకు నిలిపివేశారు. విశాఖపట్నం--మహబూబ్ నగర్ రైలు 17వ తేదీ వరకు రద్దు కాగా, జడ్చర్ల--మహబూబ్ నగర్, మహబూబ్ నగర్--విశాఖపట్నం, మహబూబ్ నగర్--జడ్చర్ల మధ్య నడిచే రైళ్లు 18వ తేదీ వరకు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

కల్వకుర్తి, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్):
నాగర్ కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలం, ఇల్లికల్ గ్రామంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. ప్రవీణ్ అనే యువకుడు ఇంటికి నీళ్లు పడుతుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. వెంటనే స్పందించిన స్థానికులు అతన్ని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో శోక వాతావరణం నెలకొంది.

## అరుదైన పాముల పట్టివేత

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్):
నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో, ఎండబెట్లలో శనివారం అరుదైన వోల్ఫ్ పాము, నాగుపాము కనిపించి గ్రామస్తుల్లో భయం నెలకొంది. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్లు వెంటనే చేరుకుని రెండు పాములను సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం వాటిని సమీప అడవిలో వదిలిపెట్టడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పాలకుర్తి, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్):
జనగామ జిల్లా,పాలకుర్తి మండలం, ముత్తారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చాకలి ఐలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ



చైర్‌పర్సన్ లావుడ్య మంజుల భాస్కర్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, సర్పంచ్ చింతకింది అనిత ఉపేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, రాఘవరావు, పులి గణేష్, మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు మదార్, నలమాస రమేష్ గౌడ్, భూమా రంగయ్య తదితరులు పాల్గొన్నారు. రైతులకు మద్దతు ధర కల్పిస్తామని తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

భువనగిరి, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్):
యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన బర్రె భారతమ్మ



అనారోగ్యంతో చికిత్స పొందిన నేపథ్యంలో, కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.22,000 చెక్కును ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అందజేశారు. సహాయం అందినందుకు భారతమ్మ ఎమ్మెల్యేకు, కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణాధ్యక్షుడు కూర వెంకటేష్, బుషపక భిక్షపతి, జాలిగం శివ తదితరులు పాల్గొన్నారు.

# కరువు దరువు!

మొదటిపేజీ తరువాయి..

కారణంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని తెలంగాణ వెదర్ మ్యాన్ ట్వీట్ చేసింది. 2026 వర్షపాతానికి సంబంధించిన అంచనాలు తెలంగాణలో కొంత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. కొన్నేళ్లుగా తెలంగాణలో మంచి వర్షాలు పడ్డాయని.. ముఖ్యంగా 2025లో అధిక వర్షపాతం నమోదైందని తెలిపింది. రైతులు సాగు చేసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొంది. అయితే, 2026లో పరిస్థితి మారే సూచనలు కనిపిస్తున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించింది. 2018 సంవత్సరం తరహాలో ఈసారి వర్షపాతం ఉండొచ్చని అంచనా వేసింది. జూన్- సెప్టెంబర్ కాలంలో అన్ని నెలలూ 'సగటు కంటే తక్కువ' వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. కానీ, 2014-15 సంవత్సరాల మాదిరిగా తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం తక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. అయితే, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. మహబూబ్‌నగర్, నారాయణపేట్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల్ వంటి ప్రాంతాలు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశముందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉ ఒడడంతో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# పూలే ఆశయాలే మార్గం.. రాష్ట్రవ్యాప్తంగా ఘన నివాళులు

హైదరాబాద్, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్):
రెండు తెలుగు రాష్ట్రాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు,



ప్రజాప్రతినిధులు ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. పూలే ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సమాజంలో వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఆయన ఆలోచనలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

**పాలకుర్తిలో....**

జనగామ జిల్లా, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే గారు సామాజిక సమానత్వం, మహిళా విద్య, దళితుల హక్కుల కోసం చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు దేశానికి ఆదర్శమని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాపాక సత్యనారాయణ, రాఘవరావు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పులి గణేష్, గిరగాని కుమారస్వామి, సంగి వెంకన్న యాదవ్, చిలువేరు కృష్ణమూర్తి స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జనగామలో కలెక్టర్ కార్యాలయంలో..**

జనగామ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జ్యోతి వెలిగించి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధికి విద్యే మూలమని, వివక్షలేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, ఎన్.ఎల్. నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్ కన్నా పరశురాములు, రవీందర్, సిద్దయ్య గౌడ్, పండుగ హరీశ్, చిర్రా వీరస్వామి, వేముల బాలరాజు, మేకల సమ్మయ్య, గంటె ఉపేందర్ యాదవ్, బిర్రు సత్యనారాయణ, కృష్ణమూర్తి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**కొల్లాపూర్‌లో...**

నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కౌన్సిలర్లతో కలిసి పూలే విగ్రహానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, ముఖ్యంగా మహిళల హక్కుల కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు పాల్గొని నివాళులు అర్పించారు.

**దేవరుప్పులలో...**

జనగామ జిల్లా, దేవరుప్పులలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాండు కృష్ణతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పూలే గారి సామాజిక సేవ, కుల వివక్ష నిర్మూలన, వితంతు వివాహాల ప్రోత్సాహం, ఆడపిల్లల విద్యాభివృద్ధి కోసం చేసిన కృషిని వివరించారు. సమాజంలో సమానత్వం కోసం ఆయన చూపిన మార్గం ప్రస్తుత తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సత్యశోధక్ సమాజ్ స్థాపన ప్రాముఖ్యతను కూడా వివరించారు.

**మల్లంపల్లిలో...**

పాలకుర్తి మండలం, మల్లంపల్లి గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పోశాల వెంకన్న ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. పూలే గారి జీవితం, సేవలను స్మరించారు. విద్యా విస్తరణకు ఆయన చేసిన కృషి, సత్యశోధక్ సమాజ్ స్థాపన, మహిళా విద్యకు చేసిన సేవలు విశేషమని తెలిపారు. ఆయన రచనలు 'గులాంగిరి', 'శెత్కరాయచా ఆసుద్' సమాజ మార్పుకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. మల్లంపల్లిలో జరిగిన మరో కార్యక్రమంలో దేవరా సాయిలు పాల్గొని, పూలే అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. మనువాద వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం చారిత్రాత్మకమని తెలిపారు. మహిళా విద్యకు పాఠశాలలు స్థాపించి సమాజంలో మార్పుకు దారితీశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏర్పుల దయాకర్, పురుమా సోమిరెడ్డి, తాళ్ల పెల్లి దేవి, గంగారపు యాకయ్య, గంగారపు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# ఇక వాట్సాప్‌లోనే రిజిస్ట్రేషన్ సేవలు!

మొదటిపేజీ తరువాయి..

అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ఈ సేవలను విస్తరించినట్లు మీసేవ కమిషనర్ టి. రవికిరణ్ ప్రకటించారు. ఈ నూతన విధానంతో భూమి పత్రాలు, సర్టిఫైడ్ కాపీల వంటి పనుల కోసం ఇకపై రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తమ మొబైల్ ఫోన్ నుంచే పనులు పూర్తి చేసుకోవచ్చు.గతేడాది నవంబర్ 18న ప్రారంభించిన 'మీసేవ వాట్సాప్ చాట్‌బాట్' సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్న నేపథ్యంలో ఈ సేవలను మరింత విస్తరించారు. పౌరులు తమ ఫోన్‌లో 8096958096 నంబర్‌ను సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో 'హాయ్' అని సందేశం పంపడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. ఈ చాట్‌బాట్ ద్వారా రిజిస్ట్రేషన్ పత్రం సర్టిఫైడ్ కాపీ, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), స్టాంపుల కొనుగోలు, ఫ్రాంకింగ్, డెఫిసిట్ చెల్లింపులు, సొసైటీలు, ఫర్మ్‌ల రిజిస్ట్రేషన్, అపరాధ రుసుము చెల్లింపు, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు వంటి అనేక సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సేవలను వినియోగించుకోవడం చాలా సులభం. వాట్సాప్‌లో కావాల్సిన సేవను ఎంచుకుని, అవసరమైన వివరాలను ఫామ్‌లో నింపిన తర్వాత, ఆన్‌లైన్ ద్వారానే రుసుము చెల్లించవచ్చు. సర్టిఫైడ్ కాపీల కోసం దరఖాస్తు చేస్తే, అధికారులు ఆమోదించిన వెంటనే ఆ పత్రాలు నేరుగా వాట్సాప్‌కే పంపబడతాయి. ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్‌ను మీసేవ కేంద్రాల ద్వారా పొందవచ్చు. స్టాంప్స్, పెనాల్టీ చెల్లించిన వారు సంబంధిత పత్రాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల పౌరుల సమయం ఆదా అవ్వడమే కాకుండా, దళారుల ప్రమేయం తగ్గి పారదర్శకత పెరుగుతుందని, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ కూడా గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# నేడు ఇంటర్ ఫలితాలు

మొదటిపేజీ తరువాయి..

ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

# టోల్‌ప్లాజా వద్ద విషాదం

మొదటిపేజీ తరువాయి..

తమిళనాడుకు చెందిన డ్రైవర్ ఆంటోని జేవియర్ అతివేగంగా నడపడంతో లైన్ ఎంపికలో గందరగోళానికి గురై, నియంత్రణ కోల్పోయి ప్రమాదానికి కారణమయ్యాడని పోలీసులు తెలిపారు. సుమారు 70-80 టన్నుల బరువున్న ట్యాంకర్‌ను తొలగించేందుకు ఐదు క్రేన్లు కూడా సరిపోకపోవడం పరిస్థితి తీవ్రతను చూపించింది. గంటన్నర పాటు శ్రమించి వాహనాన్ని పక్కకు జరిపి మృతదేహాన్ని బయటకు తీశారు.
గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన శ్రీనివాసరావు న్యాయవృత్తిలో సౌమ్యుడిగా, పేదల పక్షపాతిగా మంచి పేరు సంపాదించారు. ఆయన మరణంతో న్యాయవర్గం దిగ్భ్రాంతికి గురైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అవినీతా?


మొదటిపేజీ తరువాయి..

మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.నాపై తప్పుడు ప్రచారం చేశారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు ఖర్చుచేశారని, తనపై తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనను ప్రలోభాలకు గురిచేశారని.. అయినా తాను వారికి లొంగలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని... అవినీతి సీతక్క అంటున్నారని.. జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. తానెక్కడా అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ.11,650లకు ఫోన్లు కొంటే.. రూ.14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు. ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం.. చట్టపరమైన చర్యలు తప్పవు. దమ్ముంటే మీ ఆరోపణలు నిరూపించండంటూ సవాల్ విసిరారు.




## సిసి కెమెరాలంటే గిట్లుండాలె పో!?

సీసీ కెమెరాలంటే ఏంటియి? ఎరికేనా? గివీట్నే క్లోస్డ్ సర్క్యూట్ టెలివిజన్ అంటరు. నిఘా, భద్రత కోసం పెట్టే గీ కెమెరాలు యిడియోలు తీత్తయి. గవాటితోటి ఎసొంటి దొంగల్నైనా సిటికెల పట్టుకోవచ్చన్నట్లు! దొంగతనం జరిగినంక పోలీసోల్ల లెక్క పట్టుకునుడు కాదుల్లా..! ఏకంగా దొంగలు దొంగతనం శేత్తాంటనే పట్టుకునే కెమెరాల్ని ఎక్కడన్నా సూసిండ్రా? శెప్తా సూడుండ్రి!



ఒక దుకాణంల దొంగలు పడ్డరు. ఇగ దబ్బ దబ్బ లోపల దూరిండ్రు. ఆల్ల పని మొదలు పెట్టిండ్రో లేదో.. గా సీసీ కెమెరాలు గూడ వాటి పని మొదలు పెట్టినయి. గవాళ్ళు లోపలకు రావంగనే గా సీసీ కెమెరాల నుండి ఘాటైన పొగ వచ్చుడు మొదలైంది. సిడెం సేపట్లనే గది గా గదంతా గుప్పుమన్నది. ఇగ గా దొంగల కండ్లు మండి, మూర్ఛపోయినంత పనైంది. గీ లోగనే గా దుకాణపాయినె రానే వచ్చె! ఇగ గా దొంగల్ని పట్టుకుని పోలీసులకు అప్పగించె!! ఇగో గియి కొత్త రకం సీసీ కెమెరాలన్నట్లు. గయి దొంగల్ని సూడంగనే ఒక రకమైన పొగని సూరిత్తయి. గా పొగతోటి గా దొంగలు మూర్ఛపోతరు. గీ కెమెరాలు ఎంత మంచిగున్నయో కదా?

## అంగన్‌వాడీలకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ..

కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు!

పాలకుర్తి, ఏప్రిల్ 11 (అడుగు న్యూస్):
పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో శనివారం పలు అభివృద్ధి, రాజకీయ కార్యక్రమాలు సాగాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె






మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం, పోషణలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని, సాంకేతికతను జోడించడం ద్వారా గర్భిణీలు, బాలింతల వివరాల నమోదు మరింత పారదర్శకంగా, వేగవంతంగా మారుతుందని పేర్కొన్నారు. మరోవైపు పాలకుర్తి నియోజకవర్గంలో రాజకీయ వలసలు జోరందుకున్నాయి. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమక్షంలో రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఉప సర్పంచ్ తోట సోమనర్సయ్యతో పాటు పలువురు వార్డు సభ్యులు, అలాగే మురిపిరాల గ్రామానికి చెందిన సుమారు 40 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఝాన్సీ రాజేందర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ నిర్లక్ష్యం వహించడం వల్లే తాము పార్టీని వీడినట్లు చేరిన నాయకులు తెలిపారు. ఈ చేరికలతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందని ఝాన్సీ రాజేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐటీడీఏల బలోపేతం

మొదటిపేజీ తరువాయి..

డా. వి. సముజ్వల, సంచాలకులు, గిరిజన సాంస్కృతిక - శిక్షణా సంస్థ ఈ కార్యశాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుండి హాజరైన గిరిజన సంక్షేమ శాఖ, ఐటిడిఎ అధికారులకు స్వాగతంపలికారు. ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, వాటి బలోపేతం, విభిన్న రాష్ట్రాలలో అమలు అవుతున్న విధానాలలో తేడాలు, నిధుల వినియోగ విధానాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. ఐటీడీఏల ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక వసతుల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలని భావించారు. గిరిజన ప్రాంతాలలో




జీవనోపాధి అవకాశాలను పెంపొందించడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువతకు శిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ద్వారా యువతకు శిక్షణ అందించడం పై చర్చ జరిగింది. గిరిజన హక్కుల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు, భూమి సమస్యల పరిష్కారం, వలసల నియంత్రణ వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ జరిగింది. గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. గిరిజన విద్యా అభివృద్ధిలో భాగంగా స్థానిక భాషలలో ప్రాథమిక విద్య, కెరీర్ గైడెన్స్, మరియు ఆశ్రమ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కొన్ని ప్రాంతాలలో 100శాతం ఎస్సెస్సీ ఫలితాలు సాధించిన ఉత్తమ పద్ధతులను ఇతర ప్రాంతాలకు విస్తరించాలని నిర్ణయించారు. అంతేకాక, గిరిజన సహకార సంస్థల ద్వారా పెట్రోల్ బంకులు, ఎల్పీజీ, విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాల ఏర్పాటు, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జీవనోపాధి కార్యక్రమాల అభివృద్ధిపై చర్చించారు.

# ఆటలు

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..




# బోణీ కొట్టిన చెన్నై

## 23 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ పై గెలుపు

## ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపించిన సంజూ శాంసన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్(జూఖ) ఎట్టకేలకు బోణీ కొట్టింది. వరుసగా మూడు పరాజయాల తర్వాత తొలి విజయాన్ని అందుకుంది. శనివారం చెన్నై వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సీఎస్‌కే 23 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. సంజూ శాంసన్ అజేయ శతకంతో.. జెమీ ఓవర్టన్(4/18) అద్భుత బౌలింగ్‌తో చెన్నై సూపర్ కింగ్స్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లకు 212 పరుగులు చేసింది. సంజూ శాంసన్(56 బంతుల్లో 15 ఫోర్లు, 4 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. ఆయుష్ మాత్రే(36 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో అక్షర్ పటేల్ ఒక్కడే ఒక వికెట్ తీయగా.. ఆయుష్ మాత్రే రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో189 పరుగులకు ఆలౌటైంది. ట్రిస్టన్ స్టబ్స్(38 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 60) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. పాతుమ్ నిస్సంక(24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41) దూకుడుగా ఆడాడు. సీఎస్‌కే బౌలర్లలో జెమీ ఓవర్టన్(4/18) నాలుగు వికెట్లు తీయగా.. అన్షుల్ కంబోజ్(3/35) మూడు వికెట్లు పడగొట్టాడు. ఖలీల్ అహ్మద్, గుర్జప్‌నీత్ సింగ్, నూర్ అహ్మద్ తలో వికెట్ తీసారు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది వరుసగా రెండో పరాజయం. 213 పరుగుల లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ తమ ఇన్నింగ్స్‌ను మెరుగ్గానే ఆరంభించింది. అయితే జెమీఓవర్టన్ అద్భుత బౌలింగ్‌తో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. ఇన్‌ఫామ్ బ్యాటర్ సమీర్ రిజ్వీ(6), డేంజరస్ డేవిడ్ మిల్లర్, ఆకిబ్ నబీతో పాటు క్రీజులో సెట్ అయిన ట్రిస్టన్ స్టబ్స్‌ను ఓవర్టన్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ముఖ్యంగా స్టబ్స్-మిల్లర్ నెలకొల్పిన 45 పరుగుల భాగస్వామ్యానికి తెరదించి మ్యాచ్‌ను తమవైపు తిప్పుకున్నాడు. ముఖ్యంగా డేవిడ్ మిల్లర్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన విధానం ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. ఓవైపు వరుసగా వికెట్లు కోల్పోయినా.. మరోవైపు స్టబ్స్ హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. అతన్ని కూడా ఓవర్టనే ఔట్ చేసి చెన్నై విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

## ఇలా బౌలింగ్ చేస్తే ఏం చేయలేం: ఇషాన్ కిషన్

చెత్త బౌలింగ్, స్లాగ్ ఓవర్లలో పేలవ బ్యాటింగ్ తమ పతనాన్ని శాసించాయని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. బౌలర్లు ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయకపోతే ఏం చేయలేమని తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా శనివారం ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించింది.219 పరుగుల భారీ స్కోర్‌ను సన్‌రైజర్స్ కాపాడుకోలేకపోయింది. ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన ఇషాన్ కిషన్.. ప్రత్యర్థి బ్యాటర్లకు తగ్గట్లు బౌలింగ్ చేయడంలో విఫలమయ్యామని అంగీకరించాడు.'మా స్కోరు పెద్దదే కానీ గెలవడానికి అది సరిపోలేదు. మేం ఆరంభించిన తీరును బట్టి



250 పరుగుల భారీ లక్ష్యం నమోదు చేయాల్సింది. కానీ అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది. మేం అనుకున్నన్ని పరుగులు చేయలేకపోయాం. అదే సమయంలో.. పంజాబ్ కింగ్స్ అద్భుతంగా బ్యాటింగ్ చేసింది. పవర్‌ప్లే వారికి అనుకూలించింది. మేం బౌలింగ్‌లో విఫలమయ్యాం. సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేయలేకపోయాం. టీ20 క్రికెట్‌లో సరైన చోట బంతులు వేయడం చాలా ముఖ్యం. ఈ విషయంలో ఈరోజు మేం వెనకపడ్డాం. వాస్తవానికి 219 స్కోర్ మంచిదే. మా ఆరంభం చూసి ఈజీగా 240 పరుగులు చేస్తామని భావించాం. అయితే జట్టులో ఆరు ఏడుగురు బౌలర్లు ఉన్నప్పుడు 219 పరుగులను కాపాడుకోవచ్చు. కానీ ప్రత్యర్థి బ్యాటర్ల ఆటకు తగ్గట్లు బౌలింగ్ చేయాలి. ఈ విషయంలో మేం వెనుకబడ్డాం. అందుకే చివర్లో వారు ఈజీగా పరుగులు రాబట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మ్యాచ్ మధ్యలో ఎలాంటి ప్లాన్ చేయలేం. మ్యాచ్ ముందే ప్రణాళికలు రచించాలి. ఏ బ్యాటర్ ఎక్కడ హిట్టింగ్ చేస్తాడు..? ఒకవైపు బౌండరీ పొడవుగా ఉంటే, ఆ వైపును వాడుకోవాలనేది చూసుకోవాలి. కానీ సరైన లెంగ్త్‌లో బంతులు వేయలేనప్పుడు ఏం చేయలేం. ప్రతీ ఓవర్‌లో 10-20 పరుగులు అదనంగా ఇచ్చాం. పంజాబ్ బ్యాటర్లు కూడా అద్భుతంగా ఆడారు.వీలైనంత త్వరగా ఈ పరాజయాన్ని మరిచి తదుపరి మ్యాచ్‌కు సిద్ధమవుతాం. ఇది చాలా సింపుల్ క్రికెట్. బ్యాటింగ్‌కు వెళ్లడం, పరుగులు చేయడం. బౌలర్ల వద్ద ఒక టార్గెట్ ఉంటుంది. దానిని కాపాడటానికి ప్రయత్నించాలి. కానీ సరైన ప్లానింగ్ లేకుండా పరుగులను కట్టడి చేయలేం. ప్రణాళికలు, వాటిని అమలు చేయడంపైనే విజయవకాశాలు ఆధారపడి ఉంటాయి.'అని ఇషాన్ కిషన్ చెప్పుకొచ్చాడు.

# హైదరాబాద్‌పై పంజాబ్ విక్టరీ

## ఆకాశమే హద్దుగా చెలరేగిన శ్రేయస్ అయ్యర్

సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై పంజాబ్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్.. నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 219 పరుగుల భారీ స్కోరు చేసింది. భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన




పంజాబ్ కింగ్స్ కేవలం 18.5 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 223 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్లు ప్రభుసిమ్రన్, ప్రియాంష్ ఆర్య అద్భుత ఆరంభాన్ని అందించారు. కేవలం 6 ఓవర్లలో 99 పరుగుల పార్ట్‌నర్‌షిప్ అందించారు. ఆ తర్వాత వచ్చిన పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 33 బంతుల్లోనే 69 (5 ఫోర్లు, 5 సిక్సులు) పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

ఒక దశలో హైదరాబాద్ బౌలర్లు నియంత్రణలోకి వచ్చినట్లు కనిపించినా, శ్రేయస్ భారీ సిక్సర్లు, బౌండరీలతో రాంపేజ్ సృష్టించి ఆట స్వరూపాన్నే పూర్తిగా మార్చేశాడు. అతనికి జతగా షశాంక్ సింగ్ 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. బౌలర్లలో శివంగ్ కుమార్ 3, హర్ష్ దూబే ఒక వికెట్ పడగొట్టారు. మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 219 పరుగులు సాధించింది. అభిషేక్ శర్మ 74 (8 సిక్సులు, 5 ఫోర్లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడి.. జట్టుకు మంచి ఆరంభాన్ని అందించాడు. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (38)తో కలిసి తొలి వికెట్‌కు 8 ఓవర్లలో 120 పరుగులు జోడించారు. ఇషాన్ కిషన్ (27), క్లాసిన్ (39).. ఇలా టాప్ ఆర్డర్ మొత్తం పరుగులు సాధించడంతో ా=ఎ ఒక దశలో జట్టు స్కోరు 250 దాటేలా కనిపించింది. అయితే శశాంక్ సింగ్ ఒకే ఓవర్లో ఇద్దరు ఓపెనర్లను ఔట్ చేసి పంజాబ్‌కు అద్భుతమైన బ్రేక్ ఇచ్చాడు. ఇక పంజాబ్ బౌలర్లలో అర్షదీప్, శశాంక్ సింగ్ చెరో రెండు వికెట్లు పడగొట్టగా.. బార్ట్‌లెట్ ఒక వికెట్ తీసుకున్నాడు.

# సినిమా

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..




## ప్యారడైజ్ నుంచి కాయడు లోహర్ లుక్ విడుదల

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయడు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయడు రెట్రో లుక్‌లో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ÷ూఒ÷ఎ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.

## తమ్ముడు టైటిల్ కోసం నాగార్జున పెద్దమనసు

సినీ పరిశ్రమలో సినిమా టైటిల్స్ మారడం, ఒకరి దగ్గరున్న టైటిల్ మరొకరు తీసుకోవడం చాలా సాధారణ విషయం. ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ అయిన టైటిల్‌ను అవసరమైతే రిక్వెస్ట్ ద్వారా లేదా పరస్పర అంగీకారంతో మార్పిడి చేసుకోవడం తరచూ జరుగుతూనే ఉంటుంది. అలాంటి అరుదైన, ఆసక్తికర సంఘటనల్లో ఒకటి పవన్ కళ్యాణ్ మరియు నాగార్జున మధ్య జరిగిన 'తమ్ముడు' టైటిల్ వ్యవహారం. 'తొలిప్రేమ' భారీ విజయంతో పవన్ కళ్యాణ్ కెరీర్ ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వెళ్లింది. ఆ వెంటనే దర్శకుడు అరుణ్ ప్రసాద్ తో కలిసి ఆయన చేసిన సినిమా 'తమ్ముడు'. ఈ చిత్రం విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, పవన్‌ను యూత్ ఐకాన్‌గా మరింత బలపరిచింది. ముఖ్యంగా పాటలు, స్టైల్, యాక్షన్, కామెడీ అన్నీ కలిసి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 'తమ్ముడు' అనే టైటిల్ మొదట నాగార్జున వద్దే ఉంది. ఆయన, హరికృష్ణ కలిసి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ఒక సినిమా చేయాలని ప్లాన్ చేశారు. ఆ కథకు 'తమ్ముడు' అనే టైటిల్‌ను నిర్ణయించి ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ కూడా చేయించారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ సినిమా కోసం నిర్మాత శివ రామకృష్ణ ఆ టైటిల్‌ను నాగార్జునను అభ్యర్థించగా, ఆయన సానుకూలంగా స్పందించి 'తమ్ముడు' టైటిల్‌ను ఇచ్చేశారు. తరువాత నాగార్జున తన సినిమాకు 'సీతారామరాజు' అనే టైటిల్ పెట్టుకున్నారు. ఆ చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించింది.



## జననాయగన్' లీక్ వ్యవస్థలో లోపం

### నటుడు కమలహాసన్ ఆవేదన

ప్రస్తుతం ఇండస్ట్రీలో 'జననాయగన్' లీక్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై అగ్రహీరోలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విడుదల కూడా కాకముందే సినిమా లీక్ కావడంతో అటు దర్శకనిర్మాతలు కూడా షాక్ అయ్యారు. వెంటనే పైరసీని ఆన్‌లైన్ నుంచి తొలగించాలని లేకుంటే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. లీక్ అయిన సన్నివేశాలను షేర్ చేయడం కూడా చట్టపరమైన నేరమేనని ఎవరూ షేర్ చేయెుద్దంటూ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఇండస్ట్రీలోని ప్రముఖులు దీనిపై వరుస పోస్టులు పెడుతున్నారు. సినిమా దురదృష్టవశాత్తూ లీక్ కావడం తననెంతో ఆందోళనకు గురి చేసిందని చిరంజీవి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో స్టార్ హీరో కమల్‌హాసన్ పోస్ట్ వైరల్‌గా మారింది. సెన్సార్ జాప్యం వల్లే సినిమా లీక్ అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'జననాయగన్ సినిమా లీక్ అవడం అనుకోకుండా జరిగిన విషయం కాదు. ఇది వ్యవస్థ వైఫల్య ఫలితం. దీని పనులు సకాలంలో జరిగిఉంటే ఈరోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు. సెన్సార్‌బోర్డులో జరిగిన విపరీతమైన జాప్యం పైరసీకి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించింది. పైరసీ రాజకీయాలకు అతీతమైనది. అది కళపై, కళాకారుడి పైన చేసే దాడి. వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణుల కృషిని ప్రమాదంలో పడేస్తుంది. అలాగే మనం ప్రేమించే సినిమాను నిలబెడుతున్న వాళ్లపై, నిజాయతీగా పన్ను చెల్లిస్తున్న నిర్మాతలు, థియేటర్ యజమానులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. వ్యవస్థ విఫలమైనప్పుడు సినిమాను ఎవరు కాపాడతారు? విడుదల విషయంలో చట్టపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు విచారణ వేగవంతం చేయాలి. గతంలో మీరు నాకు అండగా నిలిచినట్లే, నిజమైన సినిమా ప్రేమికులు ఇప్పుడు కూడా ఏకమవ్వండి. ఈ చిత్రాన్ని థియేటర్లలోనే చూద్దాం. దానికి సహకరించండి' అని కమల్ హాసన్ అన్నారు. 'సినిమా లీక్ అయిందని తెలిసి షాక్ అయ్యాను. చాలా బాధగా ఉంది. దీనికి కారణమైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి' అని రజనీకాంత్ ఆవేదన వ్యక్తంచేశారు.


## స్వయంభు టీజర్‌కు భారీ స్పందన

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.




## నెట్‌ఫ్లిక్స్‌లోకి ఉస్తాద్ భగత్ సింగ్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీనికి సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు. నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా




ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు అన్నది చిత్ర కథ.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005